www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 31 డిసెంబరు 2022

5

ఏలూరు



గుడ్లను వారానికి మించి నిల్వ ఉంచొద్దు: కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

మధ్యాహ్న భోజనంలో అందిస్తున్న గుడ్లను వారానికి మించి నిల్వ ఉంచొద్దని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. ఏలూరులో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత ఆరిడేజిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం, నాడు-నేడు పనుల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే సంబంధిత ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారాంతంలో మిగిలిన గుడ్లను నిల్వ ఉంచకుండా వాటితో ఎగ్‌బుర్జీ చేసి విద్యార్థులకు అందించాలన్నారు. గన్‌బజార్‌లోని లక్ష్మీ శ్రీనివాస రైస్‌మిల్లును తనిఖీ చేసి ధాన్యం నిల్వలను పరిశీలించారు. శ్రీ రామాంజనేయ మొన్యూరు కంపెనీని తనిఖీ చేసి నిర్దేశిత ధరలకే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలన్నారు.

సమస్యలపై చర్చిస్తారా..!

- నేడు ఏలూరులో ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- హాజరుకానున్న మంత్రులు, ఎంఎల్ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు
- పింఛన్ల రద్దు, ధాన్యం కొనుగోలు వంటి సమస్యలతో జనం సతమతం
- కౌలురైతులకు రుణాలు, ఆయిల్‌పామ్ రైతులకు మొక్కలు అందని పరిస్థితి
- కోలుకోలేని స్థితిలో వరి, ఆక్వా రైతులు, అధ్వానంగా రోడ్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా ప్రజానీకం సమస్యలతో సతమతమవుతున్నారు. పింఛన్ల రద్దు నుంచి ధాన్యం కొనుగోలు, కౌలురైతులకు రుణాలు, ఆయిల్‌పామ్ రైతులకు మొక్కలు అందక ఇలా అనేక సమస్యలతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆక్వారైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రోడ్లు పరిస్థితి అధ్వానంగా తయారై రోడ్డు ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలలో విషాదఛాయలు అలుముకుంటున్నాయి. నేడు జరగనున్న ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలు చర్చిస్తారా.. లేక తూతూమంత్రంగా సమావేశం ముగించేస్తారా అనే చర్చ సాగుతోంది.

అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ ఇస్తున్నామంటూ ప్రభుత్వం చెబుతున్న గొప్పలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు సంబంధం లేకుండాపోయింది. వచ్చే జనవరి నుంచి పెన్షన్ సొమ్ము రూ.2500 నుంచి రూ.2,750కు పెంచుతున్నట్లు ప్రకటించడంతో లబ్ధిదారులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో ఏలూరు జిల్లాలో 6,500, పశ్చిమగోదావరి జిల్లాలో 6,237 మొత్తం 12,237 పింఛన్లను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు లబ్ధిదారులకు అధికారులు నోటీసులిచ్చారు. అధికారులు నోటీసు ఇచ్చిన వారంతా పింఛన్‌కు పూర్తిస్థాయిలో అర్హులే. అయితే 2016లో జరిగిన ప్రజాసాధికార సర్వేను ప్రాతిపదికగా తీసుకుని కుమారులకు కారు కొనుగోలు చేసే తల్లిదండ్రులకు, ఇంట్లో ఎవ్వరికి ఉద్యోగం ఉంటే ప్రత్యేక రేషన్ కార్డు ఉన్న తమ్ముడికి పింఛన్ నిలుపుదల చేయడం, భూములు లేకపోయినా ఉన్నట్లు చూపడం వంటివి పేర్కొంటూ పింఛన్ నిలుపుదల చేస్తున్నారు. హౌస్‌హోల్డ్ సర్వేతో ఆధార్ లింక్ తొలగిస్తేనే సమస్య పరిష్కారమవుతోంది. అయితే డీలిట్ ఆప్షన్ ఓపెన్ చేయకుండా ప్రభుత్వం పింఛన్‌దారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో పింఛన్‌దారులు లబోదిబోమంటున్నారు. జెడ్‌పి సమావేశంలో దీనిపై కూలంకషంగా చర్చిస్తేనే పింఛన్‌దారుల సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక చాలామంది ఇళ్ల నిర్మాణాలకు వెనకడుగువేస్తున్నారు. కొన్నిచోట్ల ఇచ్చిన స్థలాలు ఇళ్ల నిర్మాణానికి అనుకూలంగా లేకుండాపోయాయి. గత జెడ్‌పి సమావేశంలోనూ స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యలను లేవనెత్తారు. ఇప్పటికీ సమస్య పరిష్కారమైన దాఖలాల్లేవు. ఈసారైనా సమస్య పరిష్కారం దిశగా చర్యలు సాగుతాయో.. లేదో వేచిచూడాలి.

దయనీయంగా ధాన్యం కొనుగోలు

రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ధాన్యం కొనుగోళ్లలో నూతన విధానం తేవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రబీ నాట్లు మొదలైన ఇప్పటికీ ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదు. ఏలూరు జిల్లాలో 3.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యమవ్వగా ఇప్పటి వరకూ 2.62 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. దాదాపు ఇంకా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదేవిధమైన పరిస్థితి ఉంది. ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్ములు సైతం 21 రోజుల్లో జమకావడం లేదని అన్నదాత గగ్గోలు పెడుతున్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై చర్చ సాగితేనే వారికి మేలు జరిగే అవకాశం ఉంది. రెండు జిల్లాల్లోనూ మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉండగా, ఇప్పటి వరకూ లక్ష మందికిపైగా మాత్రమే కౌలుకార్డులు జారీ చేశారు. ఏలూరు జిల్లాలో 43,551 కౌలుకార్డులు జారీ చేస్తే దీనిలో ఏడు వేల పైచిలుకు కార్డుదారులకు మాత్రమే రూ.46.79 కోట్లు బ్యాంకు రుణాలు అందాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ రుణ మంజూరు పరిస్థితి ఇదేవిధంగా ఉంది. వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా చేస్తున్న కౌలురైతులకు రుణాలందక నానావస్థలు పడుతున్నారు. కౌలురైతులకు రుణాలందించే విధంగా సమావేశంలో చర్చ సాగితే రైతులకు మేలు జరుగుతుంది. పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం రైతులకు మొక్కలు కూడా అందించని పరిస్థితి నెలకొంది. రూ.191కు అందాల్సిన మొక్కను రూ.400కుపైగా వెచ్చించి రైతులు బ్లాక్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉద్యాన శాఖ పనితీరుపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పామాయిల్ మొక్కలను వెంటనే అందించేలా సమావేశంలో నిర్ణయం తీసుకుంటే రైతులకు మేలు చేకూరుతుంది. ఆక్వా సాగులో మేత ధరలు పెరిగిపోయి రైతులకు పెట్టుబడి విపరీతంగా పెరిగింది. దీంతో వందకౌంట్ ధర కనీసం రూ.240 ఇవ్వాలని ఆక్వా రైతులు కోరగా ఆ ధర అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పినా కార్యాచరణకు నోచుకోలేదు. ఆక్వా రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సిడీకి జోన్ల నిబంధనలు పెట్టడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆక్వా రైతులకు మేలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా సమావేశంలో చర్చిస్తారో.. లేదో వేచిచూడాలి.

అధ్వానంగా రోడ్లు

ప్రతి సమావేశంలోనూ అధ్వానంగా ఉన్న రోడ్లపై చర్చ జరుగుతున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. గోతులతో నిండిన రోడ్లపై ప్రయాణాలు సాగిస్తున్న ప్రయాణికులు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. దీంతో ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. రోడ్ల మరమ్మతులపై కచ్చితమైన గడువు నిర్ణయించేలా సమావేశంలో చర్చించాలని జనం కోరుతున్నారు. ప్రజా సమస్యలపై సర్వసభ్య సమావేశంలో చర్చ జరుగుతుందో.. లేదో వేచిచూడాలి.

సిఐటియు రాష్ట్ర మహాసభ

భవిష్యత్తు ఉద్యమాల వేదిక..

- 2న జెండా ఆవిష్కరణతో మహాసభ ప్రారంభం
- అదే రోజు మధ్యాహ్నం భారీ ప్రదర్శన, బహిరంగ సభ
- హాజరుకానున్న కేరళ మంత్రి రాజీవ్, జాతీయ నేతలు
- 1నుంచి సాంస్కృతిక ప్రదర్శనలు
- అదే రోజు జిల్లాకు చేరనున్న కార్మిక చైతన్య యాత్రలు
- 2న గూడెం నుంచి భీమవరం వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, నేతలు

ప్రజాశక్తి - భీమవరం

భవిష్యత్ ఉద్యమాల వేదికగా సిఐటియు రాష్ట్ర 16వ మహాసభ నిర్వహించుకుంటున్నామని, ఈ మహాసభలో అన్ని వర్గాల ప్రజలూ పాల్గొని జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ తెలిపారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించి మహాసభ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై, కనీస వేతనం, ఉద్యోగ భద్రత, కార్మిక చట్టాలు అమలుకై సిఐటియు నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుతూ నిరంతరం ప్రజా ఉద్యమాల నాయకత్వం వహించే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ భీమవరం పట్టణంలో జనవరి 2, 3, 4 తేదీల్లో ఘనంగా జరగనున్నాయని తెలిపారు. మొదటి రోజు 2వ తేదీన వేలాది మంది కార్మికులతో భారీ బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. మొత్తంగా 26 జిల్లాల నుంచి 800 మంది కార్మిక, ఉద్యోగ, సంఘాల నాయకులు ప్రతినిధులుగా హాజరవుతారని పేర్కొన్నారు. కార్మిక వర్గ, ఉద్యోగ వర్గ, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులు, సామాన్య చిరుద్యోగుల కోసం, నిరుద్యోగం, ఉద్యోగ భద్రత వంటి వాటిపై చర్చించి రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం కోసం రాష్ట్ర మహాసభ వేదికగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

2న సిఐటియు జెండా ఆవిష్కరణతో మహాసభ ప్రారంభం
రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్

మల్టీప్లెక్స్ వెనకాల అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ మండపంలో జనవరి 2న సిఐటియు జెండా ఆవిష్కరణతో రాష్ట్ర మహాసభ ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ తెలిపారు. భీమవరంలో మొట్టమొదటిసారిగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మహాసభలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది మంది కార్మిక నాయకత్వం ప్రతినిధులుగా హాజరుకానున్నారని, మూడు రోజులపాటు కార్మికుల సమస్యలపై స్థూలంగా చర్చించి భవిష్యత్ ఉద్యమాలపై కార్యాచరణ రూపొందించనున్నారని తెలిపారు. ఈ నెల 28 నుంచి ఇచ్చాపురం, కుప్పం, శ్రీకాకుళం జిల్లా మందాడలో మూడు బస్సు యాత్రలు ప్రారంభమయ్యాయని, ఒకటో తేదీన జిల్లాలోకి తాడేపల్లిగూడెం వద్ద ప్రవేశస్తాయని తెలిపారు. రెండో తేదీన తాడేపల్లిగూడెం నుంచి భారీ మోటార్ సైకిల్ ర్యాలీ భీమవరం వరకూ సాగుతుందని, అక్కడ ప్రదర్శనలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఒకటో తేదీ సాయంత్రం నుంచి కేశవరావు హైస్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించనున్నామని తెలిపారు. రాష్ట్రంలో కార్మికులకు ఏ సమస్యలొచ్చినా వారి రక్షణ, ఉద్యోగ భద్రత, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం సిఐటియు అనేక ఉద్యమాలు చేపట్టిందని గుర్తు చేశారు. పరిశ్రమలు మూతపడి రోడ్డున పడ్డ కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసి వారికి అండగా సిఐటియు నిలించిందని గుర్తుచేశారు. మోడీ పాలనలో శ్రమకు తగ్గ వేతనమే కాకుండా కనీస వేతన చట్టాన్ని కూడా అమలు చేయకుండా నియంతృత్వ పాలన చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకుండా కార్మికులకు అన్యాయం చేసిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై కార్మికులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

మహాసభకు ప్రముఖులు హాజరు
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

భీమవరంలో సిఐటియు రాష్ట్ర మహాసభ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని, ఈ మహాసభకు కార్మిక సంఘాలకు నాయకత్వం వహిస్తున్న ప్రముఖులు హాజరుకానున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ అన్నారు. ముఖ్యఅతిథిగా కేరళ పరిశ్రమల శాఖ, న్యాయశాఖ మంత్రి పి.రాజీవ్, సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, ప్రధాన వక్తలుగా, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నర్సింగరావు, ఎంఎ గఫూర్, ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ, అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబీరాణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఉభయగోదావరి జిల్లాల నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. ఈ మహాసభలో కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యాపారవేత్తలు మేధావులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, నాయకులు బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

తీపి గురుతులు.. చేదు మరకలు..

కాలగమనంలో మరో సంవత్సరం కనుమరుగు కానుంది.. గతం ఒక జ్ఞాపకం.. అనుభవం.. గుణపాఠం.. అటువంటి ఎన్నో అనుభూతులు.. షడ్రుచుల సమ్మేళనమే 2022 సంవత్సరం. ఈ కాలంలో ఎన్నో విషాధ ఘటనలు చోటుచేసుకున్నాయి.. మరువలేని మధుర స్మృతులు ఆవిష్కృతమయ్యాయి. వాటిలో ముఖ్య ఘట్టాలను మరోసారి అవలోకనం చేసుకుందాం.

- పశ్చిమ డెస్క్





పందేల జోరు.. పోరాటాల హోరు.. ★ ★ ★

జనవరి: సంక్రాంతి ముసుగులో జిల్లాలో జోరుగా కోడి పందేలు, జూదాలు నిర్వహించారు. మూడు రోజులపాటు యథేచ్ఛగా సాగిన పందేల్లో వందల కోట్ల సొమ్ము చేతులు మారింది. పోలీసు శాఖతోపాటు రెవెన్యూ అధికారులు సైతం ఆ మూడురోజులు పత్తాలేకుండా పోవడం గమనార్హం.

జీతాలకు కోతపెట్టే పిఆర్‌సి వద్దంటూ ఫ్యాప్టో ఆధ్వర్యాన ఆందోళనలు మిన్నంటాయి. జిల్లా కలెక్టరేట్‌ను దిగ్బంధనం చేశారు. ప్రొబేషన్ ఖరారు చేసి, వేతన సవరణ చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపట్టారు.



నిరాశ.. నిరసనలు ★ ★ ★

ఫిబ్రవరి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులు లేకపోవడంతో జనం నిరాశకు గురయ్యారు. విద్యుత్ కోతలపై అన్నదాతలు రోడ్డెక్కారు. ఫ్యాప్టో పిలుపు మేరకు రివర్స్ పిఆర్‌సికి వ్యతిరేకంగా ఉపాధ్యాయుల నిరసనలు కొనసాగాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని విద్యార్థి, యువజన సంఘాల చలో కలెక్టరేట్‌ను పోలీసులు భగ్నం చేశారు. జిల్లా కేంద్రంగా నరసాపురాన్ని ప్రకటించాలని ఐకాస ప్రతినిధులు డిమాండ్ చేశారు. మత్స్యకార అభ్యున్నతి సభలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సిద్ధాంతం, మార్టేరు, పాలకొల్లు మీదుగా నరసాపురం వరకూ రోడ్డుషో నిర్వహించారు.




ఊరట.. కలవరం ★ ★ ★

మార్చి: యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో చిక్కుకున్న జిల్లాకు చెందిన తణుకు, నరసాపురం, ఉండి తదితర ప్రాంతాలకు చెందిన వైద్య విద్యార్థులు క్షేమంగా స్వస్థలాలకు చేరుకోవడంతో తల్లిదండ్రులు ఊరట చెందారు. సర్ సిఆర్‌రెడ్డి కళాశాల 75 వసంతాల వేడుకల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలో మూడు రోజుల్లో 16 మంది కల్తీసారా తాగి మరణించడం ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం సృష్టించింది. మృతుల కుటుంబాలను టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన, వామపక్షాల నేతలు పరామర్శించారు.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు నిరసిస్తూ కార్మిక సంఘాల పిలుపు మేరకు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జిల్లాలో విజయవంతమైంది.



కొత్త జిల్లాలు.. మంత్రులు..

ఏప్రిల్: కొత్త జిల్లాలు కొలువ య్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాగా ఏర్పాటయ్యాయి. కొంతభాగం తూర్పుగోదావరి జిల్లాలో కలిసింది. పశ్చిమగోదావరి జిల్లా మంత్రులిద్దరికీ కీలక శాఖలు దక్కాయి. ఉప ముఖ్యమంత్రిగా, దేవదాయశాఖ మంత్రిగా కొట్టు సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖా మంత్రిగా కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రమాణస్వీకారం చేశారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని గొల్లపల్లిలోని స్పిన్నింగ్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. రూ.30 కోట్ల విలువైన పత్తి బేళ్లు దగ్ధమయ్యాయి. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంలో ఫోరస్ రసాయన కర్మాగారంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుని 12 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెలలోనూ టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జిల్లాలో పర్యటించారు.



అకాల వర్షం.. రైతన్నకు కష్టకాలం..

మే: ఉమ్మడి జిల్లాలో ఈ నెలలో రెండు దఫాలుగా ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. గణపవరంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటించారు. గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరిలో కలపుతామని ప్రకటించారు.



ఆందోళనల పర్వం..

జూన్: జిల్లాలో 46 ఎయిడెడ్ పాఠశాలలు మూతపడడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనలు చేపట్టారు. పరిహారం పెంచే వరకూ పనులు సాగనివ్వబోమని గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూములిచ్చిన రైతులు నిరసన బాట పట్టారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాకు రాష్ట్రస్థాయిలో 12వ స్థానం లభించింది. 57.55 శాతానికి ఉత్తీర్ణత పడిపోయింది.



గోదావరి వరద కష్టాలు..

జులై: అల్లూరి సీతారామరాజు 125వ జయంత్యుత్సవం సందర్భంగా భీమవరంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని ప్రధాని నరేంద్రమోడీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మోడీతోపాటు గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సిఎం జగన్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, సినీ నటుడు చిరంజీవి పాల్గొన్నారు. గోదావరికి అనూహ్యంగా వచ్చిన భారీ వరదలతో విలీన మండలాలు, గోదావరి పరివాహక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. విలీన మండలాల్లో జనం గుట్టలపై తలదాచుకోవాల్సిన దుస్థితి దాపురించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న గర్భిణులను హెలికాప్టర్‌లో తరలించారు. ఈ నెలలోనూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ జిల్లాలో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సిఎం జగన్ పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు.



విషాద కాలం. ★ ★ ★

ఆగస్టు : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. లింగపాలెం మండలం భోగోలులో పిగుడుపాటుకు నలుగురు వలస కూలీలు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గణపవరం మండలం వల్లూరులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు అదుపుతప్పి పంట కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. పెనుమంట్ర మండలం గరువులో ఒక ఇంట్లో దొంగలు పడి భారీ స్థాయిలో బంగారు ఆభరణాలు అపహరించారు.



రెబెల్‌స్టార్ కన్నుమూత ★ ★ ★

సెప్టెంబర్: నటనాకౌశలంతో నలభై ఏళ్లు పైబడి వెండితెరపై వెలిగిన రెబల్‌స్టార్ కృష్ణంరాజు మృతి అభిమానులను కన్నీటి సంద్రంలో ముంచింది. కేంద్ర మంత్రి హోదాలో జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన కృషిని జనం స్మరించుకుంటూ కన్నీటి వీడ్కోలు పలికారు. సిపిఎస్ రద్దు చేయాలంటూ జిల్లావ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. సెప్టెంబర్ 1న సిపిఎస్ విద్రోహ దినం పేరుతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పింఛనర్ల ఐక్య కార్యాచరణ సమితి (ఐకాస) ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళనలు నిర్వహించారు. అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అమరావతి రైతులు చేపట్టిన మహాపాదయాత్ర ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది.



చోరులను పట్టేశారు.. ★ ★ ★

అక్టోబర్ : రూ.22 లక్షల విలువైన 105 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన వాటిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితులకు అందించారు. భీమవరం పట్టణంలోని బిసి బాలుర కళాశాల వసతి గృహానికి చెందిన 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆకివీడులో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది.

మృత్యు ఘోష..



నవంబరు : ఏలూరు మండలం కలకుర్రులో చేపల చెరువుల పనికి వెళ్లిన ఇద్దరు మహిళా కూలీలు తిరిగొస్తుండగా పడవ బోల్తా పడి మృతి చెందారు. తాడేపల్లిగూడెం మండలం కడియద్దలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడుతో ముగ్గురు మృతి చెందారు. ఉమ్మడి జిల్లాతో విడదీయలేని బంధం ఉన్న సూపర్‌స్టార్ కృష్ణ కన్నుమూశారు. నరసాపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు సిఎం జగన్ నిర్వహించారు. పెదవేగి మండలం కూచింపూడి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 11 మంది, పాలకోడేరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. జిల్లాలో చంద్రబాబు రోడ్‌షో నిర్వహించారు.

ప్రాణాలు తీసిన పేలుళ్లు..



డిసెంబర్: పోలవరం ప్రాజెక్టు స్పిల్ ఛానల్‌లో పడవ బోల్తా పడి ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారు. జంగారెడ్డిగూడెంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. పెంటపాడు మండలం ప్రతిపాడులోని ఫుడ్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ (3ఎఫ్) కర్మాగారంలో భారీ అగ్ని ప్రమాదంచోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక కార్మికుడు సజీవదహనమయ్యారు.

ఇవిఎం, వివిప్యాట్‌ల పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్స్ (ఇవిఎం) భద్రతపై ఏలూరు కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం, వివిప్యాట్ గోడౌనును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎస్ఎస్.మూర్తితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఇవిఎం, వివి ప్యాట్ గోడౌనును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను ఎలక్షన్ కమిషన్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికల మెటీరియల్ భద్రపరిచిన గదిని పరిశీలించారు. 15 రోజులకు ఒకసారి పోలీస్ భద్రతతో క్లీనింగ్ చేయించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎస్ఎస్.మూర్తిని కలెక్టర్ ఆదేశించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చనుబండ జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - చాట్రాయి

ఉమ్మడి కృష్ణా జిల్లా గుడివాడలో ఎస్‌జిఎఫ్ నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపికలో చనుబండ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సిహెచ్.కృష్ణశ్రీతి అండర్ 17 విభాగంలో, ఎస్.మంజు, ఎ.కీర్తన అండర్ 14 విభాగంలో ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెరంపూడి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు మెరంపూడి సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు బి.గోపి, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

ఘనంగా ఎంఎల్ఎ ఆళ్ల నాని పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక 40వ డివిజన్‌లోని చేపల తూము సెంటర్ ప్రాంతంలో జిల్లా బిసి మహిళా సంఘం అధ్యక్షురాలు, కార్పొరేటర్ తమరాడ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ ఆళ్ల నాని పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రాంతాల ప్రజలకు పలు డివిజన్లకు చెందిన ప్రాంతాల ప్రజలకు కార్పొరేటర్ ప్రసాద్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ ప్రముఖులు కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఎంఎల్ఎ నానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు వికలాంగులకు బస్సుపాసులు అందజేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

అర్హులైన వికలాంగులకు రాయితీ బస్సుపాసులు మంజూరు చేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ గంగాధరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపో సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అర్హులైన వికలాంగులకు బస్సుపాసులు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన వారు ఆధార్, సదరమ్ సర్టిఫికెట్, పాస్ ఫొటో, రూ.వంద తీసుకు రావాలని తెలిపారు.

వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ

జంగారెడ్డిగూడెం : నాలుగో వార్డులోని వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో తులసి మొక్కలను పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ ప్రత్యేక క్లోస్ నర్సరీ వితరణతో పలువురికి తులసి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మద్ది సాయి, ధనకుమార్, శ్రీనివాసరావు, రోటరీ కార్యదర్శి రంగబాబు, ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హిరాబెన్‌కు నివాళి

ప్రజాశక్తి - గణపవరం

ప్రధానమంత్రి మాతృమూర్తి హిరాబెన్ మృతికి గణపవరంలో కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం భవనంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. హిరాబెన్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం భవనం అధ్యక్షులు ఆదిఎస్.రాజు, ఉపాధ్యక్షులు వంకాయల రామారావు, కార్యదర్శి ఎన్.రాంపండు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రభుత్వానికి, ప్రజలకు వాలంటీర్లు వారధిలా వ్యవహరిస్తూ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని కైకలూరు నియోజకవర్గ పరిశీలకుడు గౌడ సంఘం రాష్ట్ర ఛైర్మన్ శివరామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డు వద్ద సంక్షేమ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను మరింత చేరువ చేసేలా వాలంటీర్లు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీ రామచంద్రప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు విజయనిర్మల, ఎంపిటిసి సభ్యులు గోడపటి రూస్వీ, సర్పంచి మెండ రూస్వీ పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెంలో శుక్రవారం వాలంటీర్లతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థాన ప్రాంగణంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ మాదు శివరామకృష్ణ, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం ముదినేపల్లిలో జనసేన కనకమహాలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఆర్‌ఒ ప్లాంట్‌ను ఎంఎల్ఎ డిఎన్ఆర్ ప్రారంభించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - గణపవరం

ట్రాఫిక్ నిబంధనలపై శ్రీ చైతన్య సిబిఎస్ఇ స్కూల్ విద్యార్థులు శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జగదీష్ మాట్లాడుతూ ప్రజలకు ట్రాఫిక్ సమస్యపై అవగాహన లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గణపవరం, సరిపల్లి, భువనపల్లి గ్రామాల్లో ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో చైతన్య స్కూల్ ఉపాధ్యాయులు రామకృష్ణ, పోషియాలు, ఎవిఎం చైతన్యకుమార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల ద్వారా వచ్చే ప్రాణాంతక వ్యాధులు డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులను కొంతవరకు తగ్గించుకోవచ్చని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు సూచించారు. స్థానిక ఏలూరు కల్పనా థియేటర్, ఉల్లిపాయల మార్కెట్ ప్రాంతాల్లో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ జ్వరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కరపత్రాలు పంచి ప్రజలకు అవగాహన కల్పించారు.

బూరుగుపల్లి ఆంజనేయులుకు సన్మానం

ఉంగుటూరు : చేబ్రోలు రైల్వే అండర్ పాస్ మార్గాన్ని సిమెంట్ రహదారిగా సొంత నిధులతో నిర్మించిన బూరుగుపల్లి ఆంజనేయులును చేబ్రోలు ముస్లింలు, గ్రామస్తులు సత్కరించారు. స్థానిక మసీదు మజ్జిద్ మసీదులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు.

కుంటుపడుతున్న గిరిజన అభివృద్ధి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధితో పాటు పదాన్సిన ఐటిడిఎలో అధికారులు లేకపోవడంతో గిరిజన అభివృద్ధి కుంటుపడుతుందని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ అధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. మండలంలోని పడమటి పాలకుంట గ్రామంలో గిరిజన సంఘం జిల్లా శిక్షణ తరగతులకు సంఘం జిల్లా కార్యదర్శి తెల్లం రామకృష్ణ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. రెండో రోజు గిరిజన చట్టాలు-హక్కులు ఆవశ్యకత అంశంపై మిడియం బాబూరావు బోధించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ముంజ్రు బుల్లెయ్య, తెల్లం దుర్గారావు, పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్, బొరగం భూ చంద్రం, దోడ దుర్గ, తెల్లం వెంకటలక్ష్మి, కె.ప్రకాష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏడుగురిపై కిడ్నాప్ కేసు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తనను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ సాగర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఓ ప్రయివేట్ విద్యా సంస్థలో ఫిజికల్ డైరెక్టర్ పని చేసి మధ్యలో మానేసిన ఏలేటి దుర్గారావు మరో విద్యాసంస్థలో చేరారు. ఈ క్రమంలో ఈ నెల 29వ తేదీన ఏలేటి దుర్గారావుతో పాటు ఆయన అనుచరులు కలిసి తనను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని దుర్గారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ బాబు తెలిపారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్

ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఏలూరు సిటీలో కోట దెబ్బ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, వివిధ శాఖలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు సిటీ కార్యదర్శి ఎల్.రాజేష్, నగర నాయకులు రాకేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

యర్రమళ్లలో విషాదం | గుండెపోటుతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు



రాజేష్ (ఫైల్)

స్కూలుకు వెళ్లిన కుమారుడు ఇంటికి తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు తీరని ఆవేదన మిగిలింది. తనను ప్రతిరోజు సైకిల్‌పై పాఠశాలకు తీసుకెళ్లే అన్నయ్య లేడని ఆ చెల్లెలు కన్నీరుమున్నీరైంది. పదో తరగతి విద్యార్థి మృతితో యర్రమళ్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. నాచుగుంట పంచాయతీ యర్రమళ్ల గ్రామానికి చెందిన బోగా రాజేష్ (15) ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అదే పాఠశాలలో తన చెల్లి ఎనిమిదో తరగతి చదువుతుంది. ఉంగుటూరు హైస్కూలుకు నిత్యం సైకిల్‌పై వెళ్తాడు. తనతో పాటు తన చెల్లిని కూడా తీసుకెళ్తాడు. రోజూలానే శుక్రవారం పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం పాఠశాల విద్యార్థులందరికి యోగా క్లాసులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులందరిని గ్రౌండ్‌కి పిలిచారు. ఇంకా ఎవరైనా విద్యార్థులు రాకుండా క్లాస్ రూంలో ఉన్నారేమో చూడటానికి రాజేష్ రెండో అంతస్తులో తరగతి గదికి వెళ్లాడు. ఎంతసేపటికి రాకపోవడంతో ఇతర విద్యార్థులు వెళ్లి చూడగా రాజేష్ కిందపడిపోయి ఉన్నాడు. ఉపాధ్యాయులు వెంటనే ఆటోలో స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు యర్రమళ్ల తీసుకెళ్లారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు యర్రమళ్ల వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజేష్‌కు హృదయ సంబంధ వ్యాధి ఉన్నట్లు చెబుతున్నారు. రాజేష్ తండ్రి వెంకటేశ్వరరావు గొర్రెలు కాస్తూ, తల్లి రమాదేవి కూలి పనులకు వెళ్లి కుమారుడిని, కుమార్తెను చదివించుకుంటున్నారు. అన్నా చెల్లెలు ఒకే సైకిల్‌పై యర్రమళ్ల నుంచి ఉంగుటూరుకు నిత్యం వెళ్తారు. అన్నయ్యా...రేపటి నుంచి నన్ను పాఠశాలకు ఎవరు తీసుకెళ్తారు అంటూ చెల్లెలు ప్రియాంక రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.

పర్యావరణ సమతుల్యతను పరిరక్షించాలని ర్యాలీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



అవగాహనా ర్యాలీలో విద్యార్థులు

ప్లాస్టిక్ వ్యర్థాలను నివారించడంలో ప్రతిఒక్కరూ సహకరించి, పర్యావరణ సమతుల్యతను పరిరక్షించాలని బొద్దనపల్లి గ్రామ సర్పంచి నక్కనబోయిన విజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనపై శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొద్దనపల్లి గ్రామ మాజీ సర్పంచి నక్కనబోయిన వేణు, గ్రామ కార్యదర్శి సిహెచ్.పుల్లారావు, గ్రేడ్-5 కార్యదర్శి హజరాభీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసునూరులో గోద్రేజ్ ఆయిల్‌పామ్ కంపెనీ ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

రైతులకు అధిక దిగుబడిని ఇచ్చే గోద్రేజ్ ఆయిల్‌పామ్ మొక్కల కంపెనీని ముసునూరులో ప్రారంభించడం రైతులకు ఎంతో శుభదాయకమని జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. మండలంలోని ముసునూరులో ఆయిల్ పామ్ మొక్కల కంపెనీని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, ఎపిఎంఐ ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్, ఎడిహెచ్ జి.శాంతి, మార్కెట్ డెవలప్‌మెంట్ మేనేజర్ వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి రావర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, తహాశీల్దార్ దాసరి సుధ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి సిఎం జగన్ కృషి

ప్రజాశక్తి - కుక్కునూరు

విద్యార్థుల అభ్యున్నతికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కుక్కునూరు జెడ్‌పిటిసి సభ్యులు కుంజా నాగేశ్వరరావు, సర్పంచి రావు మీనా అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 54, ఆశ్రమ పాఠశాలలో 49, కస్తూరిబా గాంధీ హాస్టల్లో 40 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు అందించారు.

చింతలపూడి : మండలంలోని రాఘవపురంలో విద్యార్థులకు ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు నీరజాసుధాకర్ ట్యాబ్‌లు అందించారు.

చాట్రాయి : మండలంలోని చాట్రాయి, చిత్తపూరు, చనుబండ, పోలవరం గ్రామాల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచులు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి గ్రామ సర్పంచి దామెర ఉష, తిరివీధి రమేష్, విస్సంపల్లి జ్యోతి, పిఎసిఎస్ అధ్యక్షుడు బాబ్జి పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు

2023 నూతన సంవత్సరం సందర్భంగా 31వ తేదీ రాత్రి ఒంటి గంట తరువాత ఎవరూ రోడ్లపై తిరిగినా, వాహనాలు అతి వేగంగా నడిపినా, శబ్దం వచ్చే హారన్ ఉపయోగించినా, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనదారులను అరెస్టు చేసి వాహనాలతో సహ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పిల్లలకు వాహనాలు ఇచ్చి బయటకు పంపవద్దని తల్లిదండ్రులకు సూచించారు. యువకులు గుంపులు గుంపులుగా రోడ్లపై తిరగరాదని పేర్కొన్నారు. తల్లితండ్రులు తమ పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తొలుత జిల్లా ప్రజలందరికీ ఎస్‌పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, నియమ నిభంధనలను పాటించి పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

ముదినేపల్లి : నూతన సంవత్సరానికి ఆహ్వానం పురష్కరించుకొని శనివారం రాత్రి పది గంటలు తర్వాత ఎవరు రోడ్లపై తిరగరాదని ఎస్ఐ షణ్ముఖసాయి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శబ్దం వచ్చే హారన్ ఉపయోగించినా, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

కైకలూరు రూరల్ : స్థానిక ఓరియంటల్ ఉన్నత పాఠశాల లో ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనం కోసం జరిగే పోటీ పరీక్షలకు హాజరయే విద్యార్థులకు పిడిఎస్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు శుక్రవారం స్టడీ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంపిపి కృష్ణ, సర్పంచి మేరినవరత్నకుమారి, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకునేలా విద్యనందించాలని ఎంపిడిఒ పి.మల్లేశ్వరి అన్నారు. మండలంలోని లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న నాడు నేడు పనులను, మధ్యాహ్న భోజన పథకాన్ని, మరుగుదొడ్ల నిర్వహణ, స్కూల్ ఆవరణలో పరిశుభ్రత పచ్చదనం వంటి వాటిపై సమీక్షించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ముసునూరు : మండలంలోని చింతలవల్లి ప్రాథమిక పాఠశాలను ఎంపిడిఒ జి.రాణి శుక్రవారం తనిఖీ చేశారు. నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు.

విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండాలి

ప్రజాశక్తి - కలిదిండి

విద్యార్థులు సామాజిక దృక్పథంతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని ప్రముఖ సైకాలజిస్ట్ ప్రొఫెసర్ జి.శ్రీనాథ్ సూచించారు. మండలంలోని కోరుకొల్లు, కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు విద్యార్థుల్లో నైతిక విలువలు అంశంపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శాఖ ఛైర్మన్ వివేకానంద, అధ్యక్ష కార్యదర్శులు గోదావరి సత్యనారాయణ, మారుబోయిన మాధవరావు, కన్వీనర్ నీలి సుమన్, ట్రెజరర్ చెన్నంశెట్టి కృష్ణ, రక్తనిధి కన్వీనర్ రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అందరి పట్ల వివక్ష : టిడిపి

ప్రజాశక్తి - నూజివీడు

సామాజిక తరగతులు, వర్గాలకు అతీతంగా ప్రతిఒక్కరూ జగన్ పాలనలో వివక్షకు, నిర్లక్ష్యానికి గురవుతున్నారని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయని, ఫలితంగా దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో కోటిన్నర మంది యువత నిరుద్యోగంతో బాధపడుతున్నారన్నారు.

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎస్‌పి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పండుగల దృష్ట్యా కోడిపందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ హెచ్చరించారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించి పలు రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్, నూజివీడు రూరల్ సిఐ అంకబాబు, ఆగిరిపల్లి ఎస్ఐ చంటిబాబు, నూజివీడు రూరల్ ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

స్పృహ తప్పిన విద్యార్థి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని నిర్వాసిత కాలనీ యర్రవరం గ్రామానికి చెందిన ప్రవీణ్ చంద్రమ్మ కాలనీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పాఠశాలకు బయలుదేరిన ప్రవీణ్ స్కూలుకు జీలుగుమిల్లిలో తిరుగుతూ జాతీయ రహదారిపై స్పృహ తప్పి పడిపోయాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న కానిస్టేబుల్ లక్ష్మణ్ ఇది గమనించి ప్రవీణ్‌ను ఆసుపత్రికి తరలించారు. ఉదయం నుంచి ఏం తినకుండా ఉండటం వల్ల కళ్లు తిరిగి పడి ఉంటాడని వైద్యులు చికిత్స చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తిరుమలాపురానికి బస్సు సర్వీస్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని తిరుమలాపురం గ్రామానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అధికారులను ఆదేశించారు. తిరుమలాపురం గ్రామ ప్రజలు విద్యార్థుల సౌకర్యం కోసం బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని కోరగా ఆయన స్పందించారు. జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపో మేనేజర్ గంగాధరరావుతో ఫోన్లో మాట్లాడి విద్యార్థుల సమయానికి అనుకూలంగా ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఇటీవల తిరుమలాపురం గ్రామంలో పర్యటించిన సందర్భంలో అక్కడి ప్రజలు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను తనకు వివరించారని గుర్తు చేశారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఏలూరు నగర శాఖ మహాసభ స్థానిక ఎపి ఎన్‌జిఒ హోంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే ఎపిడబ్ల్యుజెఎఫ్ లక్ష్యమన్నారు. అనంతరం ఏలూరు నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎంఎస్.శివప్రసాద్, కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శిగా డి.నాని, కోశాధికారిగా చదలవాడ ప్రతాప్, సంయుక్త కార్యదర్శిగా సజీ, సహాయ కార్యదర్శులుగా ప్రసాద్, ఎం.రామకృష్ణ ఎన్నికయ్యారు.

విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి - ముసునూరు

పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు నారాయణరావు నగదు బహుమతులు అందించారు. 2022లో పదో తరగతి పరీక్షల్లో మండలంలోని వేల్పుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వీరంకి ఖ్యాతిసౌమ్యంజలి, కొలుకలూరి సుజాత, గరికిముక్కు ఆజాయ్‌వర్ధన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా అదే పాఠశాల ఉపాధ్యాయులు నారాయణరావు ఆ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.రెండు వేల నగదు బహుమతి అందించారు.